సరిహద్దుల్లో పోలీసుల విస్తృత తనిఖీలు

దామరచర్ల, నాగార్జునసాగర్, మే 11: ఏపీ, తెలంగాణలో ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో ఇరువైపులా నుంచి స్వరాష్ట్రాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో వాహనాల్లో తరలివెళ్లారు. ప్రధానంగా హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఏపీకి చెందిన ప్రజలు వాహనాలు, ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండలంలోని వాడపల్లి, నాగార్జునసాగర్ సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. అక్రమంగా నగదు, మద్యం తరలివెళ్లకుండా ప్రతీ వాహనాన్ని తనిఖీచేశారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, మే 11: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి దివ్య క్షేత్రంలో శనివారం నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. పాత గుట్ట ఆలయంలో స్వయంభువులకు నిత్య కైంకర్యాలను సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని శనివారం తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ దర్శించుకున్నారు.


అస్తవ్యస్తంగా ఓటర్ల జాబితా

● ఒకే ఇంట్లో ఉంటున్న భర్త ఓటు ఒక బూత్‌లో, భార్య ఓటు మరో బూత్‌లో ● అత్తవారింటికి ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నా మారని ఓటు

ఓటర్ల జాబితాలు ఎన్నిసార్లు సవరించినా అస్తవ్యస్తంగా, చిత్రవిచిత్రంగా ఉంటున్నాయి. దీంతో పలువురు ఓటర్లు తమ ఓటు ఎక్కడ ఉందో తెలియక బేజారవుతున్నారు. ఒకవైపు ఓటింగ్ శాతం పెంచాలని ప్రచారం నిర్వహిస్తూ, మరోవైపు ఓటర్ల జాబితాలు తప్పుల తడకలుగా రూపొందిస్తే ఓటింగ్ శాతం ఎలా పెరుగుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

● మోత్కూరు

మోత్కూరు మునిసిపాలిటీలో ఇంటి నెంబరు మారడంతో మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రానికి చెందిన నర్సిరెడ్డి ఓటరు గుర్తింపు కార్డులో ఇంటి నెంబరు మార్పుకోసం దరఖాస్తు చేసుకోగా ఆయన ఓటు ఒక వార్డులో ఆయన భార్య భారతమ్మ ఓటు మరో వార్డులో నమోదు చేశారు. నర్సిరెడ్డి ఓటు అంగడి బజారులోని ప్రాథమిక పాఠశాల పోలింగ్ బూత్‌లో ఉండగా, భార్య ఓటు గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల పోలింగ్ బూత్‌లో ఉంది. బీఎల్‌వోలు (ఓటరు స్లిప్‌లు పంచే వారు) తమ వార్డు పరిధిలో ఉన్న వారికి మాత్రమే ఓటరు స్లిప్‌లు ఇచ్చి ఇతర వార్డుల్లో ఉన్న వారి ఓటు తమ వార్డులో ఉంటే వారికి ఓటరు స్లిప్‌లు ఇవ్వడం లేదంటున్నారు.



మోత్కూరులో ఒకే ఇంట్లో ఉంటున్న అన్నదమ్ముల ఓట్లు వేర్వేరు చోట్ల ఉన్న స్లిప్పులు

మోత్కూరులో కాయితాల విక్రమ్‌రెడ్డి ఓటు ఓ వార్డులో ఆయన తల్లిదండ్రులు, సోదరుడి ఓటు మరో వార్డులో ఉన్నాయి. వారి పోలింగ్ బూత్‌లు కూడా వేర్వేరుగా ఉన్నాయి. విక్రమ్‌రెడ్డికి వివాహంకాక ముందు ఆయన భార్య ఓటు కేసముద్రంలో ఉండగా, వివాహం జరిగిన తర్వాత మోత్కూరులో ఉంటున్నందున మోత్కూరుకు బదిలీ చేయమని దరఖాస్తు చేసుకున్నా బదిలీ కాలేదని చెప్పారు. ఇలానే ఒకే ఇల్లు, ఒకే కుటుంబానికి చెందిన పలువురి ఓట్లు వేర్వేరు చోట్ల ఉండటంతో ఓటర్లు ఇబ్బంది పడుతున్నారు. కొందరి ఓట్లు రెండేసి సార్లు ఉన్నాయి. గత మునిసిపల్ ఎన్నికల్లో కూడా భర్త ఓటు ఓ వార్డులో ఉంటే, భార్య ఓటు మరో వార్డులో ఉండటంతో అప్పట్లో వార్డులకు పోటీ చేసిన కౌన్సిలర్లు కూడా నానా ఇబ్బంది పడ్డారు. ఇక ముందైనా ఇంటి నంబరు ప్రకారం ఒకే ఇంటిలో ఉండే వారందరి ఓట్లు ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకోవాలని ఓటర్లు కోరుతున్నారు.

అందరి చూపు 'పోస్టల్'వైపు

● పోస్టల్ బ్యాలెట్లు వినియోగించుకున్న ఉద్యోగులు ● హోం ఓటింగ్‌లో వృద్ధులు, దివ్యాంగులు సైతం

నల్లగొండ, మే 11: నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈసారి పెద్ద ఎత్తున పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. అభ్యర్థుల గెలుపు, ఓటములపై ఈ ఓట్లు ప్రభావం చూపే అవకాశం ఉన్నాయి. గతంలో ఐదేళ్ల క్రితం పోస్టల్ బ్యాలెట్ చేతికి వచ్చి తమకు తీరిక ఉన్నప్పుడు ఓటు వేసేలా ఎన్నికల సంఘం అవకాశం కల్పించేది. కానీ గత రెండు దఫాలుగా ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు శిక్షణ సమయంలో శిక్షణ పొందే ప్రాంతంలోనే ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. దీంతో పోస్టల్ బ్యాలెట్‌కు కూడా పెద్దఎత్తున వినియోగించుకున్నారు. ఈ నెల 4వ తేదీ నుంచి, 8వ తేదీ వరకు సమయం ఇవ్వగా ఉద్యోగుల కోర్కె మేరకు 10వ తేదీ వరకు పొడిగించారు. దీంతో ఉద్యోగస్తులంతా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. వివరాల్లోకి వెళితే.. దేవరకొండ నియోజకవర్గంలో 1,155 మంది ఉద్యోగులు, నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 1,356 మంది, మిర్యాలగూడ నియోజకవర్గంలో 2,465 మంది, హుజూర్‌నగర్‌లో 1,707మంది, కోదాడ నియోజకవర్గంలో 2274మంది, సూర్యాపేటలో 3071మంది, నల్లగొండ నియోజకవర్గంలో అత్యధికంగా 4744మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వేశారు. ఇందులో అధికంగా ఉపాధ్యాయులు, పోలీస్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ శాఖ ఉద్యోగులు ఉన్నారు. ఇదిలా ఉంటే 85 ఏళ్లు దాటిన వృద్ధులతోపాటు దివ్యాంగులు 2,107మంది తమ ఓటు హక్కును హోం ఓటింగ్ ద్వారా వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లు కూడా అత్యధికంగా పోల్ అవడంతో అభ్యర్థుల్లో సైతం ఆందోళన నెలకొంది.



నల్లగొండలో హోం ఓటింగ్‌లో ఓటు వేసిన దివ్యాంగురాలు

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

తిప్పర్తి, మే 11: అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను తిప్పర్తిలో పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా లింగసముద్రం మండల కేంద్రానికి చెందిన మాచపల్లి మాల్యాద్రి అనే వ్యాపారి తెలంగాణలోని నకిరేకల్ పట్టణంలో నిమ్మకాయల వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఆరు గంటల సమయంలో బొలేరో వాహనంలో 2,400 క్వాటర్లు సుమారు 432 లీటర్ల మద్యాన్ని (రూ.2.70లక్షల విలువైన) వాహనంలో వేసి, అనుమానం రాకుండా మద్యం బాక్సుల పైనుంచి నిమ్మకాయలను పేర్చుకొని తిప్పర్తి మీదుగా మిర్యాలగూడ వైపు వెళ్తున్నాడు. విషయం తెలుసుకున్న తిప్పర్తి పోలీస్‌స్టేషన్ ఎదుట వాహనం ఆపి తనిఖీ చేయగా మద్యం సీసాలు బయటపడ్డాయి. ఈ మద్యం తరలిస్తున్న వాహనం ఓనర్, డ్రైవర్ వంగూరి కర్ణాకర్, వ్యాపారి మాల్యాద్రిపై కేసు నమోదు చేసి మద్యం సీజ్ చేసినట్లు తిప్పర్తి ఎస్‌ఐ డి.రాజు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రామ్మూర్తి, రైటర్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



తిప్పర్తిలో పట్టుబడిన మద్యం

మేళ్లచెర్వు: నిబంధనలకు విరుద్ధంగా వాహనంలో తరలిస్తున్న 119 కాటన్ల మద్యాన్ని మేళ్లచెర్వు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామాపురం గ్రామంలో శనివారం వేకువజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా బొలెరో వాహనం కనిపించటంతో పోలీసులు మద్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని వెంబండించి పట్టుకున్నారు. కాగా.. ఈ వాహనం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాకు చెందిన గాదె జానితో పాటు చెరుకుపాలెం గ్రామానికి చెందిన దూళం గోపిరెడ్డిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.8లక్షలు ఉంటుందన్నారు.

రేపు రత్యా తండాకు కేసీఆర్ రాక

దేవరకొండ, మే 11: కేసీఆర్ ఈ నెల 12న దేవరకొండ మండలం రత్యా తండాకు రానున్నారు. రత్యాతండా మాజీ సర్పంచ్, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తండ్రి కసీలాల్ శనివారం మృతి చెందారు. కసీలాల్ అంత్యక్రియల్లో కేసీఆర్‌తోపాటు హరీష్ రావు పాల్గొంటారు.

నల్లగొండలో వ్యక్తి దారుణ హత్య

నల్లగొండ టౌన్, మే 11: నల్లగొండ పట్టణంలోని బీటీఎస్ శ్రీనివాస కాలనీలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని బీటీఎస్ శ్రీనివాస కాలనీకి చెందిన సయ్యద్ వలీ(40) మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొన్నేళ్ల క్రితం ఆయనకు వివాహంకాగా పిల్లలుకాలేదు. అతని భార్య ఇంటి దగ్గరే ఉంటుండగా, కొన్ని రోజులుగా భార్య, భర్తలకు తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సయ్యద్ వలీ భార్య తరపు బంధువులకు ఈ విషయం చెప్పడంతో శనివారం రిజ్వాన్, నజీర్, సాజిద్‌లు కలిసి సయ్యద్ వలీపై కర్రలతో దాడి చేయడంతో వలీ అక్కడికక్కడే మృతి చెందాడు. సయ్యద్ వలీ కుటుంబ సభ్యుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.



సయ్యద్ వలీ మృతదేహం

బైక్ షోరూంలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నల్లగొండ, మే 11: జిల్లాకేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న ఓ బైక్ షోరూంలో శనివారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో సుమారు రూ.కోటి నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. పోలీసులు, అగ్నిమాపక అధికారుల వివరాల ప్రకారం.. వాహనాల స్పేర్ పార్ట్స్ ఉంచే ప్రాంతంలో తొలుత షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. షోరూంలు ప్లాస్టిక్ వస్తువులు, స్పేర్ పార్ట్స్, ఆయిల్ డబ్బాలు, వాహనాలకు చెందిన ఇతర పరికరాలు ఉండటంతో మంటలు వేగంగా వ్యాప్తిచెందాయి. మంటలు ఎంతకూ అదుపులోకి రాకపోవడంతో నకిరేకల్ నుంచి మరో అగ్నిమాపక వాహనాన్ని రప్పించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు దాదాపు రెండు గంటల అనంతరం మంటలు అదుపులోకి వచ్చాయి. ఈ సందర్భంగా డీఎస్పీ శివరాంరెడ్డి మాట్లాడుతూ అగ్ని ప్రమాదంపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు తెలిపారు. షోరూం యజమానులు ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామన్నారు. మంటలను అదుపులోకి తీసుకరావడానికి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సందేశ్‌కుమార్ ఆధ్వర్యంలో నకిరేకల్ అధికారి భీముడు, నల్లగొండ ఫైర్ స్టేషన్ అధికారి రాంనర్సయ్య, బిక్కు, ఫయాజ్‌ఖాన్, అయన్న, శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్, జహీర్, జానిమియాలు కృషి చేశారని అధికారులు తెలిపారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

నార్కట్‌పల్లి, మే 11: నడుస్తున్న రైలు నుంచి జారి రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం నార్కట్‌పల్లి శివారులో జరిగింది. నల్లగొండ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ డి.రజిత తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి-చిట్యాల రైల్వేస్టేషన్ మధ్యన 56/0-1 కి.మీ వద్ద రైలు పట్టాల పక్కన మృతదేహం పడి ఉన్నట్లుగా సమాచారం రావడంతో ఘటనా స్థలానికి వెళ్లి చూడగా 40 ఏళ్ల వయస్సున్న వ్యక్తి రైలు కిందపడి మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. సికింద్రాబాద్-గుంటూరు మార్గంలో వెళ్లే రైలు నుంచి జారి పడి మృతిచెందానట్లుగా భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రజిత పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి రూరల్, బీబీనగర్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ జె.కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్, పగిడిపల్లి రైల్వేస్టేషన్ల మధ్య బొమ్మాయిపల్లిలో కాజీపేట నుంచి సికింద్రాబాద్ వైపునకు వెళ్తున్న రైల్వే మార్గంలో గుర్తు తెలియని రైలు కింద పడి వ్యక్తి మృతి చెందాడు. మృతుడు సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉండి, శరీరంపై బూడిద రంగు నైట్ పాయింట్, బ్లాక్ టీషర్ట్ ఉన్నాయి. మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి మార్చురీ గదిలో భద్రపరిచినట్లు, వివరాలకోసం సెల్:9848223169ను సంప్రదించాలన్నారు.

గంజాయితో పట్టుబడిన వ్యక్తులు

భువనగిరి అర్బన్, మే 11: గంజాయితో ఉన్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాధాకిషన్ తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని గంజాయి అడ్డాలపై శనివారం దాడులు చేయగా, యాదగిరిపల్లికి చెందిన ముగ్గురి 84 గ్రాముల గంజాయిని ఉన్నట్లు గుర్తించగా సదరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

ముగిసిన ప్రచారం

- నిలిచిన ప్రచార రథాలు, ఆగిన మైకులు
- చివరి రోజు ఇంటింటి ప్రచారాలు, ర్యాలీలతో జోష్
- పోల్ మేనేజ్‌మెంట్‌లో తలమునకలైన పార్టీలు, అభ్యర్థులు

సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి తెరపడింది. రాష్ట్రంలో నాలుగో విడతగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఈనెల 13న జరగనుంది. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికలకు 48గంటల ముందుగా ప్రచారాన్ని ముగించాలి. దీంతో శనివారం సాయంత్రం ఐదు గంటలకు అధికారిక ప్రచారానికి పార్టీలు ముగింపు పలికాయి. ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాలకు సోమవారం పోలింగ్ జరగనుంది. శనివారం సాయంత్రం వరకు హోరాహోరీగా ప్రచారం సాగింది. ఆ తరువాత ప్రచార రథాలు, మైకులు ఆగిపోయాయి. పార్టీల కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని నిలిపివేశారు. ప్రచార ఘట్టం ముగియడంతో అభ్యర్థులు, పార్టీల నాయకులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఓటర్లను పోలింగ్‌కు రప్పించడంపైనే ప్రధాన పార్టీలు దృష్టిసారించాయి.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



ప్రచారం ముగియడంతో భువనగిరిలో వాహనానికి ఫ్లెక్సీని తొలగిస్తున్న యజమాని

ప్రచార ఘట్టం ముగియడంతో రాజకీయ పార్టీలు కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించాయి. పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితాలను విశ్లేషించుకున్న నాయకులు, కార్యకర్తలు ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించడంపై దృష్టి సారించారు. స్థానికంగా నివాసం లేనివారికి ఫోన్ల ద్వారా ఓటు వేయడానికి రమ్మని అభ్యర్థిస్తున్నారు. ప్రధానంగా హైదరాబాద్, ఇతర నగరాల్లో ఉద్యోగులు, జీవనోపాధికి వెళ్లిన వారిపై రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. బూత్‌ల వారీగా అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన ఓటింగ్ శాతాన్ని పరిగణనలోకి తీసుకొని ఈసారి ఓటింగ్ తగ్గకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం, అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా పోటీ తీవ్రత లేకపోవడం, అభ్యర్థులు నేరుగా ఓటర్లతో అనుసంధానం కాలేకపోవడం వంటి పలు కారణాలు ఓటింగ్ శాతాన్ని ప్రభావితం చేస్తాయని భావిస్తున్నారు. బూత్‌స్థాయిలో కార్యకర్తలద్వారా ఓటర్లకు నమూనా బ్యాలెట్లను చూపిస్తూ చివరిదశ ప్రచారం సాగించారు. చివరలో ఓటర్లకు నజరానాలు ఇస్తారా? లేదా? అనే అంశంపై కొన్ని వర్గాల్లో ఆసక్తి కనిపిస్తోంది. ప్రధాన పార్టీల క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలు ఇప్పటికే అభ్యర్థుల ద్వారా, ప్రధాన నాయకుల ద్వారా పంపకాలపై ఆరా తీస్తున్నారు. ఇప్పటివరకు ఈ అంశాలపై ఎక్కడా స్పందించని నాయకులు, చివరకు ఎలా వ్యవహరిస్తారనేది చర్చగా మారింది.

చివరి రోజు ర్యాలీలు, ఇంటింటి ప్రచారాల హోరు

ఎన్నికల ప్రచారంలో చివరి రోజు ర్యాలీలు, ఇంటింటి ప్రచారాలు హోరెత్తాయి. నల్లగొండ లోక్‌సభ అభ్యర్థులు కుందూరు రఘువీర్‌రెడ్డి(కాంగ్రెస్), కంచర్ల కృష్ణారెడ్డి(బీఆర్ఎస్), శానంపూడి సైదిరెడ్డి (బీజేపీ) ర్యాలీల్లో పాల్గొని రోడ్‌షోలు నిర్వహించారు. భువనగిరిలో బరిలో ఉన్న చామలకిరణ్ కుమార్‌రెడ్డి (కాంగ్రెస్), క్యామ మల్లేశ్ (బీఆర్ఎస్), డాక్టర్ బూరనర్సయ్య గౌడ్ (బీజేపీ) సైతం ఆయా ప్రాంతాల్లో ర్యాలీల్లో పాల్గొనడంతో పాటు, ఇంటింటి ప్రచారం సాగించారు. అభ్యర్థుల తరఫున ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, కీలక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు బూత్ స్థాయి వరకు ఎక్కడికక్కడ విస్తృతంగా ప్రచారం కొనసాగించారు. ప్రధానంగా ఇంటింటి ప్రచారం నిర్వహించి నమూనా బ్యాలెట్లను ప్రదర్శించి అభ్యర్థుల గుర్తులను ఓటర్లకు వివరించే ప్రయత్నం చేశారు.

పట్టు నిలుపుకొనేందుకు యత్నం

(ఆంధ్రజ్యోతి, యాదాద్రి)

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నేతలు తమ పట్టును నిలుపుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. సుమారు నెలరోజుల పాటు అభ్యర్థులతోకలిసి పల్లెల్లో ప్రచారాన్ని హోరెత్తించారు. వాడవాడల్లో పార్టీ నేతల ప్రచారంతో ఎన్నికల సందడి నెలకొంది. ప్రచారపర్వం ముగియడంతో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు రహస్య ప్రచారానికి తెరలేపనున్నారు. అభ్యర్థులు గ్రామాల్లోని కాలనీ సంఘాలు, పలుకుబడి ఉన్న నేతలను సంప్రదిస్తున్నారు. కరపత్రాలు, బ్యాలెట్ నమూనా పత్రాలను చేతపట్టుకుని తమకే మద్దతు తెలపాలని కోరుతున్నారు.

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఇబ్రహీంపట్నం, జనగామ, ఆలేరు, భువనగిరి, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోకవరాల్లో అభ్యర్థులు సభలు, సమావేశాలు, ఇంటింటి ప్రచారం, రోడ్‌షోలు నిర్వహించారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులంతా తెల్లవారుజామున నుంచే ప్రచారాన్ని నిర్వహించారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు విందుభోజనాలు కూడా ఏర్పాటు చేశారు. చివరి రోజు భువనగిరి పట్టణంలో ప్రధాన పార్టీలన్నీ బల ప్రదర్శన చేశాయి. అభ్యర్థులంతా పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని పార్టీలకు చెందిన అగ్రనేతలు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న ఆశతో అభ్యర్థులు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. పలు నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల మధ్య నువ్వా? నేనా? అనేలా ప్రచారాన్ని ఊదరగొట్టారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు సైతం ప్రచారాన్ని ఉధృతం చేశారు. పతుల కోసం సతులు ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి బొట్టుపెట్టి మద్దతు కోరారు. బహిరంగ ప్రచారానికి తెరపడటడంతో కుల సంఘాలు, యువతను, గ్రామాల్లో, పట్టణాల్లో పలుకుబడి ఉన్న నాయకులను తమవైపునకు తిప్పుకునేందుకు అభ్యర్థులు వ్యూహరచన చేస్తున్నారు. దీంతో మండలాల్లో రోజురోజుకూ రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. పోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో విజయం కోసం పలువురు అభ్యర్థులు డబ్బు కుమ్మరించేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

క్రాయ్ రాజా క్రాయ్



- ఏపీ అసెంబ్లీ ఎన్నికల వేళ సరిహద్దుల్లో బెట్టింగ్‌ల జోరు
- రూ.5వేల నుంచి రూ.20లక్షల వరకు బెట్టింగ్


ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికలపై రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల్లో ఉత్కంఠత నెలకొంది. గెలుపు ఎవరిని వరిస్తుందోనని టీడీపీ, వైసీపీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే ఏప అసెంబ్లీ ఎన్నికల వేళ తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. రూ.5వేల నుంచి రూ.20లక్షల వరకు ఈ బెట్టింగ్‌లు నడుస్తున్నట్టు సమాచారం.

- కోదాడ



ఏపీ రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా, వైసీపీ ఒంటరిగా పోటీచేస్తోంది. ఈనెల 13న ఏపీలో పార్లమెంట్, అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలు జరుగుతుండగా, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. దీంతో ఇక్కడ గెలుపుపై ఏపీతోపాటు తెలంగాణలో సైతం ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో బెట్టింగ్‌లకు తెరలేసింది. టీడీపీ అభిమానులు సైకిల్ గుర్తుపై, వైసీపీ అభిమానులు ఫ్యాన్ గుర్తు గెలుపుపై బెట్టింగ్‌లు వేస్తున్నారు. ఎన్నికలకు, లెక్కింపునకు 20రోజుల సమయం ఉండటంతో, బెట్టింగ్‌కు పాల్పడే వారు మాట తప్పకుండా గెలిచేవారికి సొమ్ము ఇచ్చేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అందుకు మధ్యవర్తులను ఆశ్రయిస్తున్నారు. అతడి సమక్షంలో రూ.100 బాండ్ పేపర్‌పై సంతకాలు చేసి, గెలిచినవారికి సొత్తు ఇచ్చేలా ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు సమాచారం. ఇందులో మధ్యవర్తికి రూ.100కు 2.5శాతం కమీషన్ ఇచ్చేలా ఒప్పందాలు చేసుకున్నట్లు వినికిడి. ఇప్పటికే తెలంగాణలో ఉన్న ఏపీ ఓటర్లు ఓటు వేసేందుకు రెండు రోజులుగా సొంత గ్రామాలకు పెద్ద సంఖ్యలో బస్సులు, రైళ్లు, కార్లలో బయలుదేరారు. జాతీయరహదారి-65పై వాహనాల రద్దీ ఏర్పడింది. దీంతో ఓటింగ్ శాతం భారీగా ఉంటుందని, రెండు పార్టీల విజయం నల్లేరు మీద నడకలా ఉంటుందని ఆశావహులు వారి స్థాయికి తగ్గట్టుగా రహస్యంగా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్టు సమాచారం. టీడీపీ కూటమి అభిమానులు ప్రభుత్వ ప్రజా వ్యతిరేకతతో విజయం వరిస్తుందని, వైసీపీ అభిమానులు నవరత్నాలు విజయానికి చేరువ చేస్తాయనే ధీమాతో బెట్టింగ్‌లకు సిద్ధమయ్యారు. దీంతో జూన్ 4న ఫలితాలతో బెట్టింగ్‌రాయుళ్ల భవితవ్యం తేలనుంది.

ఎన్నికల వేళ..మద్యం జోరు



- మే 1 నుంచి 9 వరకు రూ.87.26కోట్ల విక్రయాలు
- ఎన్నికల నేపథ్యంలో రెండు రోజులపాటు మద్యం అమ్మకాల నిలిపివేత
- ఇప్పటికే దుకాణాలకు చేరిన మద్యం
- రేషన్‌తో మద్యం ప్రియులకు సరిపడా అందని బీర్లు
- రూ.4.91కోట్ల లైసెన్స్ ఫీజు వెనక్కు ఇవ్వాలంటున్న దుకాణదారులు
- ఉమ్మడి జిల్లాలో 299 మద్యం దుకాణాలు 95,963 లిక్కర్, బీర్లు లిఫ్టు

కోదాడ, మే 11: ఎన్నికల వేళ జోరుగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. వేసవి అంటేనే మద్యం ప్రియులు లిక్కర్ కన్నా, చల్లని బీర్లను ఇష్టపడతారు. దీంతో కూల్, కూల్ బీర్లు దొరక్క మద్యం ప్రియులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దుకాణదారులతో ఘర్షణకు దిగుతున్న సంఘటనలు చొటుచేసుకుంటున్నాయి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మద్యం విక్రయాలు రోజు, రోజుకూ పెరుగుతున్నాయి. అందుకు మద్యం అమ్మకాల గణాంకాలను నిదర్శనంగా చెప్పవచ్చు. ఈ నెల 1వ తేదీ నుంచి 9వరకు ఉమ్మడి జిల్లాలో రూ.87.26కోట్ల విక్రయాలు జరిగాయి. అంటే నిత్యం రోజుకు రూ.9.69కోట్ల విక్రయాలు జరిగాయి. ప్రభుత్వం బీర్లను సరఫరా చేసి ఉంటే విక్రయాలు రెట్టింపు ఉండేవని వ్యాపారులు చెబుతున్నారు. కాగా ఈ నెల 13న ఎన్నికల నేపథ్యంలో 12, 13న రెండు రోజులు మద్యం దుకాణాలకు సెలవు ప్రకటించింది. దీంతో మద్యం ప్రియుల డిమాండ్ దృష్ట్యా ఇప్పటికే మద్యాన్ని డిపోలనుంచి దుకాణాలకు పంపించినట్లు సమాచారం. ఇదిలా ఉంటే మద్యం దుకాణాదారులు ప్రభుత్వ సెలవులు ప్రకటించినప్పుడు తాము నష్టపోతున్నామని, సెలవురోజుల్లో లైసెన్స్ వెనక్కు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 299 మద్యం దుకాణాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 299 మద్యం దుకాణాలున్నాయి. ప్రభుత్వం నల్లగొండ, యాదాద్రి భువనగిరి డిపోల నుంచి ఈ నెల 1నుంచి 9వరకు ఆయా దుకాణాలకు రూ.87.26కోట్ల విలువైన 95,963 లిక్కర్, బీర్ల కేసులను ఎగుమతి చేసింది. ఎన్నికల తేదీ, సెలవులు, మద్యం డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 8వ తేదీన ఒక్కరోజే నల్లగొండ, యాదాద్రి భువనగిరి డిపో పరిధిలో రూ.13.68కోట్ల విలువైన 15,045 లిక్కర్ కేసులు, 23,187 బీర్ల కేసులను లిఫ్టు చేసి, దుకాణాలకు పంపారు.

సెలవులతో రూ.4.91కోట్ల లైసెన్స్ వాపసు ఇవ్వాలి

సాధారణంగా గాంధీ జయంతి, జనవరి 26, ఆగస్టు 15న మద్యం దుకాణాలకు సెలవు. ప్రభుత్వం ఇచ్చే ఐచ్ఛిక దినాల్లో తాము చెల్లించిన లైసెన్స్ ఫీజు వెనక్కు ఇవ్వాలని దుకాణాదారులు డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి ఏపీలో మద్యం దుకాణాల కేటాయింపు టెండర్ల ద్వారా జరిగేది. టెండర్లలో ఎవరు ఎక్కువ కోడ్ చేస్తే వారికి దుకాణం దక్కేది. ఆ క్రమంలో ప్రభుత్వ అధికారిక సెలవులు మినహాయిస్తే, ప్రభుత్వం ఇచ్చే ఐచ్ఛిక సెలవు రోజుల్లో దుకాణానికి చెల్లించిన ఫీజులో రోజుకు ఎంత పడుతుందో అంతా, ప్రభుత్వానికి చెల్లించే చివరి ఇన్‌స్టాల్‌మెంట్ తగ్గించుకొని తీసుకొనేది. డ్రా పద్ధతి వచ్చాక ఐచ్ఛిక సెలవు దినాలకు మినహాయింపు ఇవ్వకుండా మొత్తం ఫీజును ప్రభుత్వం తీసుకుంటుంది.ప్రస్తుతం ప్రభుత్వం ఒక్కో వైన్ షాపునకు వార్షిక ఫీజు రూ.60లక్షలు. మునిసిపాలిటీ పరిధిలో రూ.65లక్షలు వసూలు చేస్తుంది. ఆ చొప్పున రోజుకు ఒక్కో దుకాణంపై రూ.16,438 చెల్లించాలి. ప్రభుత్వం ఎన్నికలు, ఇతరత్ర సెలవులిచ్చినప్పుడు తాము వ్యాపారం చేయకుండా ఫీజు భరించాల్సి వస్తుందంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమయంలో రెండు, ప్రసుత్తం ఎన్నికలకు రెండు, జీపీ, మునిసిపాలిటీ, ఇతర సెలవు దినాలు రెండు మొత్తంగా సంవత్సరంలో 10 రోజులు సెలవులు ప్రకటిస్తుంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని 299 దుకాణాల్లో ఒక్కో రోజుకు రూ.16,438 చొప్పున, రోజుకు రూ.49.14లక్షలు, 10 రోజులకు రూ.4,91,49,000 భరించాల్సి వస్తుందని వాపోతున్నారు. భారం పడకుండా ప్రభుత్వానికి చెల్లించే చివరి ఇన్‌స్టాల్‌మెంట్ ఫీజు భారాన్ని తగ్గించాలని వ్యాపారులు కోరుతున్నారు. అంతేగాక ప్రభుత్వడిమాండ్ సరిపడా మద్యాన్ని సరఫరా చేయాలని సూచిస్తున్నారు.



మోదీ గెలిస్తే దేశానికే ప్రమాదం

- ఇండియా కూటమిని అధికారంలోకి తేవాలి
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి

మిర్యాలగూడ, మే 11: మోదీ గెలిస్తే దేశానికే ప్రమాదమని, అందుకు ఇండియా కూటమిని అధికారంలోకి తేవాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, వామపక్ష నాయకులతో కలిసి శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణకు లౌకిక పార్టీలు ఏకమై ఇండియా కూటమిగా జతకట్టాయన్నారు. కూటమిని గెలపించి దేశాన్ని రక్షించాలని కోరారు. వామపక్ష పార్టీలు సమష్టిగా కృషి చేసి కూటమి అభ్యర్థులను గెలపించాలన్నారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం అధికంగా నమోదయ్యేలా చూడాలని పిలుపునిచ్చారు. అనంతరం జూలకంటి మాట్లాడుతూ, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్న ప్రధాని మోదీ, మతం పేరుతో ప్రజలను మరోమారు మోసం చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. మత విద్వేశాలను రెచ్చగొట్టి విభజన పాలన చేస్తున్నారన్నారు. బీజేపీ జిమ్మిక్కులను దేశ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ధీరావత్ స్కైలాబ్‌నాయక్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, సీపీఎం రాష్ట్ర నాయకులు డబ్బికార్ మల్లేష్, పొదిల శ్రీనివాస్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, గాయం ఉపేందర్‌రెడ్డి, నీరుకంటి నారాయణ, శేఖర్‌రెడ్డి, బాలు, పాల్గొన్నారు.



మిర్యాలగూడలో ర్యాలీలో పాల్గొన్న నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్, ఎమ్మెల్యే బీఎల్ఆర్, తదితరులు

వాడవాడలా విస్తృత ప్రచారం

పట్టణంలోని వాడవాడలా తిరుగుతూ కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని సీతారాంపురం, నెహ్రూనగర్ తదితర కాలనీల్లో మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, కౌన్సిలర్లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో చీదళ్ల సత్యవేణి, శ్రీనివాస్, పత్తిపాటి సంజాత, నవాబ్, సైదిరెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు, యువతకు ఉపాధే లక్ష్యం

- ఆర్‌ఆర్ఆర్ వెంట పరిశ్రమల కారిడార్
- పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు, మూసీ ప్రక్షాళన పూర్తిచేస్తాం
- కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



భువనగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

యాదాద్రి, మే 11(ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీరు, యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయమని కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం భువనగిరిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.500కోట్లు వెచ్చించి బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పనులు పూర్తిచేసివుంటే ఈ ప్రాంత సస్యశ్యామం అయ్యేదని, కానీ సీఎం కేసీఆర్ దీన్ని పట్టించుకోదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తికాకముందే కరువు తెచ్చిందని కేసీఆర్ విమర్శించారని, పదేళ్ల పాలనలో పట్టించుకోనందుకే ఈ పరిస్థితులు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా రూ.2లక్షల రుణమాఫీ, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే యుద్ధప్రాతిపదిక వీటిని పూర్తిచేస్తామన్నారు. రూ.50వేల కోట్లతో మూసీ ప్రక్షాళన చేపడతామన్నారు. జాతీయ రహదారులు ఉన్న ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు నిర్మిస్తామని, ప్రతీ నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల, రెండుమూడు మండలాలకు ఒక జూనియర్ కళాశాల ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తానన్నారు. ట్రిపుల్‌ఆర్ వెంట పరిశ్రమల కారిడార్‌ను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే సీఎం రేవంత్‌రెడ్డి 17కులాలకు సంబంధించిన కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని అన్నారు. బీజేపీ పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉండి తెలంగాణను పట్టించుకోలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.9లక్షల కోట్ల కుంభకోణాలకు పాల్పడినా నిలువరించలేదన్నారు. ఎయిమ్స్ విభజన హామీల్లో భాగమని, కానీ మేమే తెచ్చామని కొందరు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. 20ఏళ్లుగా ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్‌లో పనిచేసినందుకు పార్టీ గుర్తించి ఎంపీగా పోటీచేసే అవకాశం కల్పించిందన్నారు. ప్రచారంలో తన దృష్టికి చాలా అంశాలు వచ్చాయని, వాటిని ముఖ్యమంత్రికి వివరించానని తెలిపారు. భువనగిరి ప్రజలు కాంగ్రెస్‌కే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్‌నేత, నాయకులు కిరణ్‌యాదవ్, శ్యాంగౌడ్, పింగళిరెడ్డి, రవికుమార్, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యం

కేతేపల్లి, మే 11: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం కేతేపల్లిలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద, బడుగు బలహీన వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందించడంలో కాంగ్రెస్ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. కాంగ్రెస్ గెలిస్తే ఉపాధి కూలీని రూ.4 వందలకు పెంచుతుందన్నారు. ఎన్నికల అనంతరం అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి రూ.5లక్షలు అందిస్తామని తెలిపారు. అనంతరం స్థానిక నిమ్మలమ్మ చెరువులో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు వద్దకు వెళ్లి కలిశారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.శేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, నాయకులు ఎస్.మంగమ్మ, నాయకులు జి.మాధవరెడ్డి, బి.సుందర్, మట్టి సాల్మన్, బీరం జాన్‌రెడ్డి, ఎడ్ల ప్రవీణ్, జె.ముత్తమ్మ, ఎ.మహేందర్‌రెడ్డి, వెంకటనర్సయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి : బాలునాయక్

దేవరకొండ: నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. నియోజకవర్గంలోని చందంపేట, నేరేడుగొమ్ము, దేవరకొండ, దేవరకొండ పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ, డిండి, నక్కలగండి ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రాజెక్టులకు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రఘువీర్‌రెడ్డిని ఎంపీ అభ్యర్థిగా మెజార్టీతో గెలిపించాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల మాయమాటలు నమ్మవద్దన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జాల నర్సింహారెడ్డి, హనుమంతు వెంకటేష్‌గౌడ్, సిరాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు తథ్యం : ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: భువనగిరిలో కాంగ్రెస్ పార్టీ అధిక మెజార్టీతో గెలుపొందడం తథ్యమని లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మునుగోడులో ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంతో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజాస్వామ్య పాలన అందిస్తుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 100 రోజుల్లోనే అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని అన్నారు. ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనను ఆదరించి గెలిపిస్తే భువనగిరి పార్లమెంటును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్‌నేత, ఎన్నికల ఇన్‌చార్జిలు నారబోయిన రవిముదిరాజ్, కొలను రాజేందర్‌రెడ్డి, ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, మండల అధ్యక్షుడు సైదులు, నాయకులు పాల్వాయి జితేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మేకల ప్రమోద్‌రెడ్డి, అన్వర్, లింగస్వామి, జంగిలి నాగరాజు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో నిర్వహించిన సభలో ప్రసంగిస్తున్న రంగారెడ్డి, చిత్రంలో అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బీఎల్ఆర్

కనగల్: కాంగ్రెస్ పార్టీకే ప్రజల సంపూర్ణ మద్దతు ఉందని మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కనగల్‌లో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నమూనా బ్యాలెట్‌ను ఓటర్లకు చూపుతూ కాంగ్రెస్‌కు ఓటేయాలని అభ్యర్థించారు. జీఎడవల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

వేములపల్లి: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని ఆ పార్టీ నాయకుడు నామిరెడ్డి యాదగిరిరెడ్డి కోరారు. మండలంలోని మొల్కపట్నం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సామాన్య ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. ఆయన వెంట నాయకులు పాదూరి కిరణ్‌రెడ్డి, పేరెల్లి నగేష్, బారి పాండు, రాచూరి వెంకన్న, బొడ్డు జానకిరాములు, సురేందర్, రవీందర్‌రెడ్డి, వెంకటరమణ, పెద్దసైదులు, జాని పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య ఆధ్వర్యంలో రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంతేకాక ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రఘువీర్‌రెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు శ్రమించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొత్త దశరథ, చింతరెడ్డి సైదిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్, వెంకటేశ్వర్లు, గోపాల్, అనిల్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.



కేతేపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



మునుగోడులో చాయ్ చేస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

దేవరకొండలో ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

దేవరకొండ, మే 11: దేవరకొండ నియోజకవర్గంలో ఈ నెల 13వ తేదీన జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఆర్డీవో శ్రీరాములు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో 328 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవరకొండ నియోజకవర్గంలో 1,31,838 మంది పురుషులు, 1,30,624 మంది మహిళలు, 18 మంది ఇతరులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. నియోజకవర్గంలో 26 సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక బలగాలతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు దేవరకొండ డీఎస్పీ గిరిబాబు తెలిపారు. నియోజకవర్గంలో 600 మందికిపైగా బలగాలు ఎన్నికల బందోబస్తులో పాల్గొంటాయని అన్నారు. సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక పోలీస్ బలగాలతో బందోబస్తు చేశామన్నారు.

● **డిండి:** లోక్‌సభ స్థానానికి జరుగుతున్న ఎన్నికల ఏర్పాట్లు పూర్తయినట్లు తహసీల్దార్ తిరుపతయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 52 పోలింగ్ కేంద్రాల్లో 46 వేల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు ఆయన తెలిపారు. వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, తాగునీటి వసతి, వైద్యసిబ్బంది అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఓటర్లు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తమ ఓటును వినియోగించుకోవచ్చని అన్నారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన గోనబోయినపల్లి, దేవత్‌పల్లితండా, ప్రతాప్‌నగర్, ఎర్రారం, టి.గౌరారం, తవక్లాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద సాయుధ పోలీసులు బందోబస్తు చేస్తారని తెలిపారు.

కాంగ్రెస్‌కు ఓటు వేస్తేనే భూ నిర్వాసితులకు న్యాయం

మర్రిగూడ, మే 11: డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా కిష్టరాయిన్‌పల్లి ప్రాజెక్టులో ముంపునకు గురైనా నాంపల్లి మండలం లక్ష్మణాపురం బాధిత భూ నిర్వాసితులు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తేనే తమకు న్యాయం జరుగుతుందని శనివారం గ్రామస్థులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా బాధిత భూ నిర్వాసితులైన గట్టుప్పల్ నర్సిరెడ్డి, బాడిగ శ్రీనివాస్, గడ్డి వెంకన్న పలు పార్టీల నాయకులు, పార్టీలకతీతంగా ఉండి లక్ష్మణాపురం గ్రామంలో సమావేశమైనట్లు తెలిపారు. ముంపునకు గురైన లక్ష్మణాపురం బాధిత భూ నిర్వాసితులకు గత ప్రభుత్వం పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించడంలో విఫలమైందని అన్నారు. అందుకు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అర్హులైన లబ్ధిదారులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో పాటు పునరావాసం కల్పించబడుతుందని తీర్మానం చేసినట్లు తెలిపారు. బాధిత భూనిర్వాసితులు కలిసి భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డికి ఓటు వేస్తున్నట్లు తీర్మానించారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

గుర్రంపోడు, మే 11: మతోన్మాద బీజేపీని, రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని చేపూరి నర్సింహాచారి భవనంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జరగబోయే ఎన్నికల్లో ఇండియా కూటమి దేశంలో అధికారం చేపడుతుందని నల్లగొండ ఎంపీగా ఇండియా కూటమి అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అంజాచారి, మండల కార్యదర్శి రేపాక లక్ష్మిపతి, మాజీ జడ్పీటీసీ బచ్చనబోయిన వెంకటయ్య, మండల కార్యవర్గ సభ్యులు షేక్ మదార్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రవీంద్రకుమార్‌కు పితృవియోగం

● కన్నిలాల్‌కు కేటీఆర్, బీఆర్ఎస్ నేతల నివాళి



కన్నిలాల్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రవీంద్రకుమార్‌ను ఓదార్చుతున్న కేటీఆర్

దేవరకొండ, మే 11: దేవరకొండ మండలం రత్యతండా బీఆర్ఎస్ మాజీ సర్పంచ్, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తండ్రి రమావత్ కన్నిలాల్(78) శనివారం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవీంద్రకుమార్ తండ్రి కన్నిలాల్ మృతి చెందిన వార్త తెలియగానే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిమ్స్ ఆస్పత్రికి చేరుకొని కన్నిలాల్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రవీంద్రకుమార్‌ను ఓదార్చారు. కన్నిలాల్ మృతి బాధాకరమన్నారు. దేవరకొండ మండలం రత్యతండాకు చెందిన కన్నిలాల్‌కు భార్య జానకమ్మతోపాటు ఐదుగురు కుమారులున్నారు. రవీంద్రకుమార్ పెద్ద కుమారుడు. పౌరసరఫరాలశాఖలో ఉద్యోగం చేసి కన్నిలాల్ పదవీ విరమణ చెందారు. 2019 సర్పంచ్ ఎన్నికల్లో నూతన గ్రామపంచాయతీగా ఏర్పడిన రత్యతండా ఏకగ్రీవ సర్పంచ్‌గా బీఆర్ఎస్ నుంచి ఎన్నికై సర్పంచ్‌గా రత్యతండా అభివృద్ధికి కన్నిలాల్ కృషి చేశారు. కన్నిలాల్ మృతికి మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వడ్త్య రమేష్‌నాయక్, నేనావత్ కిషన్‌నాయక్, కేతావత్ బిల్యానాయక్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కంకణాల వెంకట్‌రెడ్డి, గాజుల ఆంజనేయులు, రాంబాబునాయక్, నర్సింహతోపాటు బీఆర్ఎస్ నాయకులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు. కన్నిలాల్ అంత్యక్రియలు రత్యతండాలో ఈ నెల 12న జరగనున్నట్లు రవీంద్రకుమార్ కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇసుక, మట్టి ట్రాక్టర్ల పట్టివేత

వేములపల్లి, మే 11: మండలంలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను, రెండు మట్టి టిప్పర్లను మైనింగ్ అధికారులు శనివారం పట్టుకున్నారు. మైనింగ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు నిర్వహించిన అధికారులు రావులపెంట పాలేరు వాగులోని ఇసుక అక్రమ రవాణా చేస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవడంతో పాటు మండలశివారులో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్న మరో రెండు టిప్పర్లను పట్టుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్లు, టిప్పర్లను వేములపల్లి పోలీసులకు అప్పగించనున్నట్లు మైనింగ్ అధికారులు తెలిపారు. పట్టుకున్న వారిలో మైనింగ్ అధికారులు వంశీ, వెంకట్‌రెడ్డి, పవన్ ఉన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా

కట్టంగూరు, మే 11: కట్టంగూరు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి ఏడుకొండల్ శనివారం తన అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో 20 సంవత్సరాల నుంచి బీఆర్ఎస్ పార్టీలో కష్టపడి పని చేశానని, పార్టీలో తగిన గుర్తింపు లేదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వైఖరి నచ్చక బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు.

నర్లకుంటను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తాం

త్రిపురారం మే 11: త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి పంచాయతీ పరిధిలోని నర్లకుంటను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామని ఎన్నెస్పీ సీఈ కరుణాకర్ తెలిపారు. ఆంధ్రజ్యోతి మినీలో 'నర్లకుంట కబ్జా' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి మాట్లాడారు. నర్లకుంట 58.28 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, కొంతమంది చుట్టు పక్కన రైతులు చెరువులో మట్టిని కుప్పలుగా పోసి ఆక్రమణకు పాల్పడ్డారు. ఎన్నెస్పీ, రెవెన్యూ సిబ్బంది కుంట దగ్గరకు వెళ్లి ఆక్రమణలను నిలిపివేసి కుంటను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా మట్టి కుప్పలు పోసిన రైతు కర్ర పెద్ద రాంరెడ్డి, ఎక్సవేటర్ యజమాని అభంగాపురం గ్రామానికి చెందిన రాజుపై మాడ్గులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చెరువును పూర్తిస్థాయిలో సర్వే చేయాలని త్రిపురారం తహసీల్దార్‌కు లేఖ అందజేసినట్లు తెలిపారు. ఎన్నికల తర్వాత అందరి సమక్షంలో సర్వే చేస్తామని పేర్కొన్నారు.

ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు

● ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు

● ఎస్పీ చందన దీప్తి



ఎస్పీ చందనదీప్తి

నల్లగొండ, మే 11: ఈ నెల 13వ తేదీన పార్లమెంటు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు, ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ చందన దీప్తి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి తన పర్యవేక్షణలో ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 37 మంది సీఐలు, 84 మంది ఎస్ఐలతో పాటు మొత్తం 3 వేల మంది సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. అదేవిధంగా ఏడు కంపెనీల కేంద్ర బలగాలను ఏర్పాటు చేశామని, వీటితో పాటు ఐదు ప్లాటున్ల టీఎస్ ఎస్పీ సిబ్బంది, పెట్రోలింగ్ పార్టీలు, క్విక్ రియాక్షన్ టీంలు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ టీంలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 313 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయని ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కేంద్ర పారా మిలటరీ బలగాల ద్వారా పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం సాయంత్రం నుంచి 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులు గుంపులుగా ఐదుగురి కంటే ఎక్కువగా తిరగరాదన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు



నల్లగొండ: కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ, నల్లగొండ రూరల్, మే 11: నల్లగొండ మండలంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం రసూల్‌పురం, ఖాజీరామారం, కొత్తపల్లి, చందనపల్లి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం కార్యకర్తలు జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ గుమ్ముల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరారు. కొత్తపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రొమ్ముల నాగయ్యతో పాటు, 100 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఖాజీరామారం గ్రామానికి చెందిన 120 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వారికి ఆయన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీటీసీ సభ్యుడు వంగూరి లక్ష్మయ్య, వెంకన్న, సైదిరెడ్డి, శ్రీనివాస్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: పెద్దవూర మండల పరిధిలోని చింతపల్లి, పర్వేదుల, గ్రామ పంచాయతీల నుంచి జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌కు చెందిన మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామస్థాయి నాయకులు సాగర్‌లో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో కొండలు, శ్రీరాములు, రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డిలతో పాటు 150 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి.



జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

కట్టంగూరు: మండలంలోని పామనగుండ్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు కొంతమంది శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎలిజాల శ్రీను, ఆవుల రాము, సైదులు, నర్సింహ, నరేష్, గణేష్ ఉన్నారు. మిట్టపల్లి శివశంకర్, కనుకుల వెంకట్‌రెడ్డి, కనుకుల ధర్మారెడ్డి, కొరివి యాదగిరి, బండారు కృష్ణ, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన సుమారు 150 మంది శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో నడింపల్లి చిన్నగోపాల్, సాగర్ల ఎట్టయ్య, పాకాల ఐలయ్య, జన్నపాల జానయ్య, కురుపాటి సాలయ్య, కురుపాటి ఉదయ్, రూపని నర్సింహ, భరత్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కోనేటి యాదగిరి, చెరుకు సైదులు, మాజీ ఎంపీటీసీ పోలగోని స్వామి, పల్లపు బుద్దుడు, పట్ల జనార్ధన్, ఉయ్యాల నరేష్, నడింపల్లి గోపాల్, లింగయ్య, దినేష్, యాదయ్య, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



గుత్తా అమిత్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్న నాయకులు

90 శాతం ఓట్లు పోలయ్యేలా చూడాలి

● జిల్లా వ్యయ పరిశీలకుడు కల్యాణ్‌కుమార్ దాస్

నల్లగొండ, మే 11: ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో 80 నుంచి 90శాతం ఓట్లు పోల్‌అయ్యేలా చూడాలని కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా వ్యయ పరిశీలకుడు కల్యాణ్‌కుమార్ దాస్ అన్నారు. ఓటర్ల చైతన్య కార్యక్రమంలో భాగంగా ఎన్‌జీ కళాశాల నుంచి క్లాక్‌టవర్ వరకు శనివారం క్యాండిల్ వాక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 61 నుంచి 64 శాతం వరకు ఓటింగ్ నమోదైనట్లు తెలుస్తుందని, ఈ సారి పోలింగ్ శాతం పెరగాలని సూచించారు. కలెక్టర్ దాసరి హరిచందన మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతీ ఒక్కరూ బాధ్యతగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి ప్రేమ్‌కరణ్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వర్‌రావు, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి కోటేశ్వర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి, వేణు పాల్గొన్నారు.



క్లాక్‌టవర్‌లో నిర్వహించి ర్యాలీలో పాల్గొన్న కల్యాణ్‌కుమార్‌దాస్, కలెక్టర్

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్



నల్లగొండలో ప్రచారం నిర్వహిస్తున్న జయప్రదరెడ్డి

నల్లగొండ, మే 11: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఐదు నెలలలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు యాట జయప్రదరాంరెడ్డి విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని 41వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఈ పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలు తిరిగి కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. నల్లగొండ పార్లమెంటు స్థానంలో కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌రావు, రాజేష్, ఎం.శ్రీనివాస్, సతీష్, ప్రవీణ్ పాల్గొన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తండ్రి కనిలాల్ మృతిపట్ల బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు యాట జయప్రదరెడ్డి సంతాపం తెలిపారు.

● కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దిశెట్టి సత్యనారాయణ, దాచేపల్లి నరేందర్, తోటపల్లి శ్రీను, వరికుప్పల పాండు, ముడిగే శేఖర్, అందుగుల వెంకటేష్, కృష్ణ, శ్రీను, బాలకృష్ణ పాల్గొన్నారు.

మునుగోడు, శాలిగౌరారం, కట్టంగూరు, చిట్యాల మండలాల్లో బీఆర్ఎస్ భువనగిరి అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ గెలుపుతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు తెలిపారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మల్లేష్ గెలుపు కోరుతూ ద్విచక్ర వాహన ర్యాలీలను నిర్వహించారు. కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. రాష్ట్రంలో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చూపుతోందన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని కోరారు.

సంక్షిప్త సమాచారం...

'ఉపాధి హామీ' రక్షణ కోసం సీపీఎంను గెలిపించాలి

కట్టంగూరు: భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు కట్టంగూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కట్టంగూరులోని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చిన్నపాక లక్ష్మి, గంజి మురళీధర్, దండెంపల్లి సత్తయ్య, పెంజర్ల సైదులు, జాల రమేష్, కట్ట బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

శాలిగౌరారం: శాలిగౌరారానికి చెందిన గుండ్లపెల్లి వెంకన్న ఇటీవల వడదెబ్బ గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చాడ రమేష్, చంద్రారెడ్డి, చాడ సురేష్‌రెడ్డి శనివారం బాధితుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడాల సైదులు, గౌర వీరయ్య, పడాల వెంకన్న, వడ్లకొండ పరమేష్‌గౌడ్, చిత్తలూరి జీడికల్లు, బట్ట వెంకన్న, శ్రీరామదాసు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం వల్లాల మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి.రాగిణి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలో ప్రతీ గ్రూపులో 40సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మృతుని కుటుంబానికి నివాళి, ఆర్థికసాయం

చిట్యాలరూరల్: చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన అంకూరి శంకర్ గుండెపోటుతో మృతిచెందగా శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకురాలు అంతటి పారిజాతనర్సింహ మృతదేహానికి నివాళులర్పించారు. మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశానుసారం రూ. 5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ దేశబోయిన మల్లమ్మపాపయ్య, సుర్కంటి సత్తిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వీల్‌చైర్ అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

చిట్యాల: రోటరీ క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ చిట్యాల అధ్యక్షుడు గుండెబోయిన సైదులు కోరారు. చిట్యాలకు చెందిన దివ్యాంగుడు పాల బిక్షంనకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వీల్‌చైర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా రోటరీ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. క్లబ్ సేవలను సద్వినియో గం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి ఎడ్ల శ్రీశైలం, కడారి సత్యనారయణ, శివసాయి, కసిరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ గెలిస్తే ఉపాధి హామీ పథకం ఉండదు

కేతేపల్లి: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే దేశంలో ఉపాధి హామీ పథకం రద్దవుతుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు అన్నారు. భువనగిరి సీపీఎం అభ్యర్థి జహంగీర్‌కు మద్దతుగా ఆయన మండలంలోని ఇనుపాముల గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడుతూ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించాలని కోరారు. భువనగిరి ఎంపీ స్థానం నుంచి పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడే సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి లూర్దుమారయ్య, నాయకులు బి.పద్మయ్య, టి.మణెమ్మ, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

చిట్యాల: చిట్యాల మునిసిపాలిటీ పరిధిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. భువనగిరి ఎంపీగా నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కూరెల్ల శ్రీను, నాయకులు కన్నెబోయిన మహలింగం, పల్లె వెంకన్న, చికిలంమెట్ల అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి: దేశాభివృద్ధికి కృషి చేస్తున్న బీజేపీకి మరోసారి ఓటు వేసి మూడోసారి మోదీని ప్రధానమంత్రిని చేయాలని మండల ప్రధాన కార్యదర్శి రమావత్ రవీందర్ కోరారు. బీజేపీని గెలిపించాలని కోరుతూ మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో కోటేష్, అంజి, శంకర్ పాల్గొన్నారు.